యాదగిరిగుట్టలో వైభవంగా నిత్యోత్సవాలు

ఊంజల్ సేవలో అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో నిత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహన సేవను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్ర పర్వంగా సాగింది. స్వామివారికి వెండి మొక్కు జోడు సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. వేసవి సెలవులు కావడంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొన్నది . సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.31,99,066 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.అర్చకులు

ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 3 : ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే నోడల్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నోడల్ అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించి మాట్లాడారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో అన్ని చర్యలు తీసుకోవాలని, నోడల్ అధికారులు విధి విధానాలు, మార్గదర్శకాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనేలా, ఓటింగ్ శాతం పెరిగేలా స్వీప్ ప్రచార కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని, పోలింగ్ సిబ్బందికి కావలసిన మెటీరియల్ సిద్ధంగా ఉంచాలని, ఎన్నికల సిబ్బందిని తరలించే వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించి సిద్ధం చేయాలని అన్నారు. ఎన్నికల కోడ్ పర్యవేక్షించే టీమ్‌లు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సువిధ యాప్ ద్వారా రాజకీయ సభలు, ర్యాలీలు, వివిధ శాఖలు ఇవ్వాల్సిన అనుమతులను నిబంధనల ప్రకారం సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం జప్తు చేసిన నగదు, వస్తువులను స్క్వాడ్ టీములు, పోలీస్ అధికారులు సమన్వయంతో సీజర్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. నియోజకవర్గాలకు సంబంధించిన ఎంసీసీ టీమ్‌లు సమన్వయం చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్, సెలైన్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, దివ్యాంగులకు వీల్ చైర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నోడల్ అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పోలింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించాలి

- జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షేత్రిమయుమ్

మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షేత్రిమయుమ్

భువనగిరి కలెక్టరేట్, మే 3 : పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, నివేదికలను సకాలంలో పంపాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్ క్షేత్రిమయుమ్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. కలెక్టరేట్ కారాలయ సమావేశ మందిరంలో భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన 400 మంది మైక్రో అబ్జర్వర్లకు (బ్యాంక్, ఎల్ఐసీ తదితర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన సిబ్బంది) శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నడిచేలా మైక్రో అబ్జర్వర్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాలని, అనెగ్జర్ -28 ప్రకారం 18 అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు జనరల్ అబ్జర్వర్‌కు నేరుగా పంపాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులను, పోలింగ్ రోజు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన విధి విధానాలు అమలును పరిశీలించాలన్నారు. మాక్ పోలింగ్, ఈవీఎం యంత్రాల సీల్, అభ్యర్థికి సంబంధించిన పోలింగ్ ఏజెంట్ల వివరాలు, 17-ఏ రిజిస్టర్ నిర్వహణ, పోలింగ్ పూర్తయ్యే వరకు జరిగే ప్రక్రియపై నివేదికలు ఇవ్వాలని, ఎన్నికల నిర్వహణలో అవకతవకలు జరిగితే జనరల్ అబ్జర్వర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్స్ కడారి నర్సిరెడ్డి, హరినాథ్‌రెడ్డి మైక్రో అబ్జర్వర్లకు అవగాహన కల్పించారు.

శిక్షణకు హాజరైన మైక్రో అబ్జర్వర్లు

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పరిశీలన

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఏఓ మందడి ఉపేందర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మే 3 : ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ల పక్రియను ఆర్డీఓ కార్యాలయ డీఏఓ మందడి ఉపేందర్‌రెడ్డి శుక్రవారం భువనగిరి తాసీల్దార్ కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ ధరణికోట భగత్, రెవెన్యూ అధికారులు కోట కళ్యాణ్, సిద్ధార్థ రెడ్డి, ప్రణయ్, జక్కుల భద్రయ్య, సీహెచ్ లోకేందర్‌రెడ్డి, ఆసిఫ్, శ్రీలత పాల్గొన్నారు.

జిల్లాలో తగ్గని ఉష్ణోగ్రతలు

భువనగిరి కలెక్టరేట్, మే 3 : జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. శుక్రవారం అధికంగా 45.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిమికి జనం ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. శుక్రవారం జిల్లాలో అత్యధికంగా వలిగొండలో 45.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆలేరులో 45.4, యాదగిరిగుట్ట, సంస్థాన్ నారాయణపురంలో 45.2, ఆతద్మకూరు(ఎం)లో 45.1, భువనగిరి, మోటకొండూరు, బొమ్మలరామారం మండలాల్లో 44.9, చౌటుప్పల్‌లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

తిట్ల దండకమే..

- గెలిపిస్తే ఏం చేస్తామో చెప్పని కాంగ్రెస్, బీజేపీ
- జోరుగా బూర, చామల వ్యక్తిగత దూషణలు
- పరస్పరం విమర్శలు, ఆరోపణలతోనే సరి
- ఏం అభివృద్ధి చేస్తారో చెప్పకుండా పాలిటిక్స్
- పక్కా విజన్‌తో ముందుకెళ్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ
- నిశితంగా పరిశీలిస్తున్న ప్రజలు

యాదాద్రి భువనగిరి, మే 3 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పార్లమెంట్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తిట్ల దండకం అందుకున్నారు. ఆ పార్టీ అభ్యర్థులు ఒకరిపై మరొకరు విమర్శలు, ఆరోపణలు చేసుకుంటున్నారు. అసలు ఎన్నికల్లో గెలిస్తే ఏం చేస్తామో చెప్పకుండా రాజకీయాలను నెట్టుకొస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ ఓ విజన్ ప్రకారం ముందుకెళ్తున్నారు. ఇలా అన్ని పార్టీల పనితీరు, పద్ధతిని పార్లమెంట్ ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఎన్నికల్లో ఆయా పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ఆలోచన చేస్తున్నారు.

జోరుగా విమర్శలు, ఆరోపణలు

జిల్లాలో ఓ వైపు భానుడి భగభగతో ఎండల వేడి.. మరోవైపు పార్టీ ఎంపీ అభ్యర్థుల రాజకీయ వేడి రాజుకుంది. భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఒక్కసారిగా రాజకీయం రసకందాయంలో పడింది. అయితే బీజేపీ, కాంగ్రెస్ క్యాండిడేట్లు వ్యక్తిగతంగా ఒకరినొకరు తిట్టిపోసుకుంటున్నారు. 'కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంతకాన్ని ఫోర్జరీ చేసిన నేత చామల కిరణ్ కుమార్‌రెడ్డి. ఆ పార్టీ ఎమ్మెల్యేలను చామల బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. అసలు హస్తం పార్టీ అభ్యర్థి ఎవరో ప్రజలు కన్ఫ్యూజన్‌లో ఉన్నారు' అని బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీనిపై చామల కిరణ్‌కుమార్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. 'బూర.. కులం, మతం అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారు. పసుమాములలో సర్వే నంబర్ 106లో ఏడెకరాల భూమికి ఎన్ఓసీ ఇప్పించుకుని అమ్ముకున్న ఘనుడు బూర.' అని చామల ప్రతి విమర్శ చేశారు. ఇలా అనేక విషయాల్లో వ్యక్తిగతంగా ఆరోపణలు చేసుకుంటున్నారు.

ఏం చేస్తమో చెప్తలేరు..

సాధారణంగా ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు ప్రచారం నిర్వహిస్తాయి. ప్రజల్లోకి వెళ్లి గెలిస్తే నియోజకవర్గానికి తామేం చేస్తామో వివరిస్తుంటారు. మరికొన్ని పార్టీలు సమావేశాలు, బహిరంగ సభలు, ప్రెస్‌మీట్లు ఏర్పాటు చేసి నియోజకవర్గ మేనిఫెస్టోను కూడా ప్రకటిస్తాయి. కానీ.. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు వాటి గురించే ప్రస్తావించడంలేదు. గతంలో ఏం చేశాం.. గెలిస్తే ఏం చేస్తామో? చెప్పడం లేదు.

నిశితంగా పరిశీలిస్తున్న జనం

భువనగిరి పార్లమెంట్ పరిధిలోని మూడు ప్రధాన పార్టీలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఎవరేం చేశారు.. ఎవరేం చేస్తున్నారు? ఎవరేం చెబుతున్నరు.. గెలిస్తే ఏం చేస్తారు? అభ్యర్థి వ్యక్తిగత ప్లస్, మైనస్‌లు తదితర అన్నింటినీ లోతుగా విశ్లేషిస్తున్నారు. ఏ పార్టీకి ఓటేస్తే ఏం లాభం.. ఏం నష్టం.. ప్రజల కోసం కొట్లాడే పార్టీ ఏది? తదితర అన్ని అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. గ్రామాల్లో రచ్చబండ దగ్గర సైతం అభ్యర్థుల పట్ల చర్చించుకుంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి.. రాష్ట్ర హక్కుల కోసం కొట్లాడి, సమస్యలపై పోరాడే పార్టీ నేత అయితే బాగుంటుందని, అలా అయితే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయనే చర్చ నడుస్తున్నది.

విజన్‌తో బీఆర్ఎస్ ముందుకు..

బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ ఓ విజన్ ప్రకారం ముందుకెళ్తున్నారు. నిత్యం ప్రజలతో మమేకమవుతున్నారు. ప్రచారం, సమావేశాలు, అంతర్గత సమావేశాలతో దూసుకెళ్తున్నారు. గెలిస్తే ఏం చేస్తానో స్పష్టంగా వివరిస్తున్నారు. మునుగోడు నియోజకవర్గానికి ఫ్లోరైడ్ రిసెర్చ్ సెంటర్‌ను తీసుకొస్తానని, పార్లమెంట్ పరిధిలో ఐటీ హబ్ ఏర్పాటు చేయిస్తానని, యాదగిరిగుట్ట, ఇబ్రహీంపట్నానికి మెట్రో రైలు, రాయగిరి వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు, మూసీ ప్రక్షాళన, ఎయిమ్స్‌లో సదుపాయాలు, యాదగిరిగుట్టలో ఆయుష్ యూనివర్సిటీ, జాతీయ రహదారులను ఆరు లేన్లు చేయిస్తానని స్పష్టం చేస్తున్నారు. తెలంగాణ కోసం కొట్లాడి అన్ని హక్కులను సాధిస్తానని హామీ ఇస్తున్నారు.


చౌటుప్పల్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం

చౌటుప్పల్, మే 3 : పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం చండూరులో రోడ్ షోకు వెళ్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు చౌటుప్పల్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. హరీశ్‌రావు అక్కడ కొద్దిసేపు ఆగి కార్యకర్తలను పలుకరించారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో సంస్థాన్ నారాయణపురం మీదుగా చండూరుకు వెళ్లారు. స్వాగతం పలికిన వారిలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి, సుర్వి మల్లేశ్‌గౌడ్ ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురంలో అగి కార్యకర్తలతో ముచ్చటిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి

ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

మోత్కూరు : దాచారంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీబీనగర్ : కొండమడుగులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మోత్కూరు, మే 3 : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. మండలంలోని దాచారం, కొండగడప గ్రామాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లం అనిత, వైస్ ఎంపీపీ బి.లక్ష్మి, నాయకులు జంగ శ్రీను, మధు, మల్లేశ్, అనిల్, శైలజ, ఇంద్రజ్యోతి, సోంమల్లు, వస్తాద్, శ్రీను, మల్లయ్య పాల్గొన్నారు.

కొండమడుగులో బీఆర్ఎస్ ప్రచారం

బీబీనగర్ : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని కొండమడుగు గ్రామంలో మంగళ్ల మైసమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, మరోసారి ఆ పార్టీ నాయకుల మాటలకు మోసపోవద్దని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కడెం చంద్రశేఖర్, పార్టీ నాయకులు కడెం సాయిలు, చినగల్ల అశోక్, పంజాల రమేశ్ గౌడ్ పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

రామన్నపేట : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని సిరిపురంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వ్యక్తికి బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించిందన్నారు. కేసీఆర్ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. కారు గుర్తుకు ఓటేసి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, నాయకులు కూనూరు మత్తయ్య, దాసిరెడ్డి శ్రవణ్‌కుమార్, గాదె శంకర్, అప్పం శ్రీరాములు, సంగిశెట్టి సత్యనారాయణ, కూనూరు మహేశ్ పాల్గొన్నారు.


రామన్నపేట : సిరిపురంలో ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అడ్డగూడూరు : జానకిపురంలో ఉపాధి హామీ కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

క్యామ మల్లేశ్ గెలుపు కోరుతూ గ్రామాల్లో ప్రచారం

అడ్డగూడూరు : భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని జానకిపురం, చిన్నపడిశాల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల దగ్గరికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వారికి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌగోని సత్యంగౌడ్, నాయకులు పూలపల్లి జనార్దన్‌రెడ్డి, పాలబిందెల వెంకన్న, కడారి సైదులు, వీరస్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి

వడదెబ్బ నుంచి రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచురించిన కరపత్రాలను విడుదల చేస్తున్న ఆరోగ్య కేంద్రం సిబ్బంది

ఆత్మకూరు(ఎం), మే 3 : వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి విలియం కేరి అన్నారు. వడదెబ్బ నుంచి రక్షించుకునేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఒక్కసారిగా తీవ్రమైన జ్వరం, తల నొప్పి, మూర్ఛపోవుట, కడుపులో తిప్పడం వంటివి వచ్చినప్పుడు వెంటనే ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స పొందాలన్నారు. ప్రజలు ఎక్కువ సమయం ఎండలో గడపరాదని, వ్యవసాయదారులు, కూలీలు ఉదయం 10గంటల్లోపు, సాయంత్రం 4గంటల తర్వాత పనులు చేసుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి వడదెబ్బ వల్లే కలిగే పరిణామాలను వివరించాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ కర్ణాకర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరాజు, సిబ్బంది సురేందర్, వెంకటేశ్, హేమ, శిరీష, మహేశ్వరి పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

నర్సిరెడ్డి (ఫైల్)

భువనగిరి అర్బన్, మే 3 : మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన యెల్లెంల నర్సిరెడ్డి (63) వడదెబ్బతో మృతి చెందాడు. నర్సిరెడ్డి శుక్రవారం అనంతారం నుంచి ద్విచక్ర వాహనంపై నీలంబావి గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ స్కూల్ సమీపంలో కళ్లు తిరుగుతున్నాయని పక్కన వాహనాన్ని నిలిపి కూర్చున్నాడు. అంతలోనే వెనుకకు కిందపడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

చంద్రకళ కుటుంబానికి జడ్పీ చైర్మన్ పరామర్శ

భూదాన్ పోచంపల్లి, మే 3 : పట్టణ కేంద్రంలో టీడీపీ మహిళా విభాగం మండల మాజీ అధ్యక్షురాలు పగడాల చంద్రకళ (52) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి ఆమె మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు గునిగంటి మల్లేశంగౌడ్, కర్ణాటక అంజమ్మ, సీతశ్రవణ్, సీతయ్య, ప్రభాకర్ ఉన్నారు.

నేటి మహాధర్నాను జయప్రదం చేయాలి

- ఎమ్మార్పీఎస్

భువనగిరి అర్బన్, మే 3 : మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎంపీ సీటు ఇవ్వకుండా అవమానించడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద శనివారం మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నాకు ముఖ్య అతిథిలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్క మాదిగ బిడ్డ కదిలి రావాలని పిలుపునిచ్చారు.

బీజేపీకి అవకాశం ఇవ్వద్దు

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

చౌటుప్పల్, మే 3 : తెలంగాణలో బీజేపీ బలపడాలని చూస్తుందని, ప్రజలు ఆ పార్టీకి అవకాశం ఇవ్వద్దని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లౌకికవాదం, అభివృద్ధి వైపు దూసుకెళ్తున్న రాష్ట్రాన్ని మతోన్మాదం వైపు పంపొద్దన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేస్తామని చెప్పడం సరికాదని, వారిలో కూడా నిరుపేదలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధ మతాల్లో సైతం నిరుపేదలు ఉన్నారని, వారికి రిజర్వేషన్లు వద్దా? అని ప్రశ్నించారు. ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు కూడా ఎత్తివేస్తారని, దీనిని ప్రజలు గమనించాలని అన్నారు. బీసీ కులాల గణన ఇప్పటి వరకు ఎన్ని సార్లు చెప్పినా చేపట్టలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియో మార్ఫింగ్ కేసుల ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదన్నారు. ఇందుకోసం పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, నాయకులు ఎండీ పాషా, బూర్గు కృష్ణారెడ్డి, కీసరి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

ఆలేరు రూరల్, మే 3 : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు ఖాయమని మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లగూడెంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఆ పార్టీలకు పార్లమెంటు ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించడానికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో ప